ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 27 మార్చి 2024



రూ.3.3 లక్షల నగదు స్వాధీనం

- ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన పోలీసులు

కొత్తూరు, మార్చి 26: ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. సిహెచ్.శ్రీనివాస్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై రూ.3.3 లక్షలు నగదు తరలిస్తుండగా అనకాపల్లి మండలం పీహెచ్ఎన్ అగ్రహారం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్-2 ఎల్.ఎ.భాగ్యలక్ష్మి పట్టుకున్నారన్నారు. అనంతరం అనకాపల్లి రూరల్ పోలీసులకు నగదును అప్పగించారని, దీంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి

ఉప ముఖ్యమంత్రిని సమన్వయకర్తగా నియమించిన అధిష్ఠానం

- మాడుగుల ఇన్‌చార్జిగా ముత్యాలనాయుడు కుమార్తె అనురాధ
- గవర సామాజికవర్గానికి వైసీపీ మొండిచేయి
- ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో ఒక్కటీ కేటాయించని అధికార పార్టీ పెద్దలు



బూడి ముత్యాలనాయుడు



ఈర్లె అనురాధ

అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్త పేరును వైసీపీ అధిష్ఠానం ఎట్టకేలకు మంగళవారం ప్రకటించింది. ఉప ముఖ్యమంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పేరును ఖరారు చేసింది. దీంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా ముత్యాల నాయుడు పోటీ చేయడం దాదాపు ఖరారైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా ఆయన కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ పేరును ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో మాడుగుల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని తెలిసింది.**

రాష్ట్రంలో 25 లోక్‌సభ నియోజకవర్గాలకుగాను అనకాపల్లి మినహా మిగిలిన అన్ని స్థానాలకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థుల పేర్లను ఈ నెల 16వ తేదీన పార్టీ అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. జాబితాలో అనకాపల్లి లోక్‌సభ స్థానానికి అభ్యర్థి పేరు వద్ద ఖాళీ వుంచి, 'కేటగిరి' కాలమ్‌లో 'బీసీ' అని మాత్రమే పేర్కొన్నారు. కాగా అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి కూటమి తరఫున జనసేన పోటీ చేయాలని తొలుత నిర్ణయించారు. కానీ బీజేపీతో టీడీపీ-జనసేన పార్టీలకు పొత్తు కుదిరిన తరువాత ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. దీంతో బీజేపీ అభ్యర్థినిబట్టి తమ పార్టీ అభ్యర్థిని ఎంపిక చేయాలని వైసీపీ పెద్దలు భావించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల కోసం అప్పటి నుంచి నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు బీజేపీ ఎంపీ అభ్యర్థుల పేర్లు ఆదివారం విడుదల కావడం, అనకాపల్లి నుంచి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పోటీ చేస్తారని వెల్లడికావడంతో వైసీపీ అధిష్ఠానం వేగంగా పావులు కదిపింది. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి సమన్వయకర్తగా ఉపముఖ్యమంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పేరును మంగళవారం ప్రకటించింది. మాడుగుల నియోజకవర్గం సమన్వయకర్తగా ఆయన కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధను నియమించారు.

గవర సామాజిక వర్గానికి వైసీపీ మొండి చేయి

జిల్లాలో ప్రధానమైన గవర సామాజికవర్గాన్ని వైసీపీ అధిష్ఠానం నిర్లక్ష్యం చేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు (మరొకటి పాక్షికం) వుండగా.. వచ్చే ఎన్నికల్లో ఒక సీటు కూడా ఈ సామాజికవర్గానికి కేటాయించలేదు. ప్రస్తుతం ఈ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ బీవీ సత్యవతి అనకాపల్లి ఎంపీగా ఉన్నారు. ఈసారి ఆమెకు అవకాశం ఇవ్వకూడదని భావించిన పార్టీ పెద్దలు.. అదే సామాజికవర్గానికి చెందిన ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పి.రమాకుమారి పేరును పరిశీలించారు. అప్పట్లో ... మిగతా 8వ పేజీలో

నేటి నుంచి సీఎస్‌కే, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

- పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ఉదయం పది గంటల నుంచి ప్రారంభం



విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 26: విశాఖ క్రికెట్ క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు బుధవారం ఉదయం పది గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ప్రారంభం కానున్నాయి. ఈ మ్యాచ్ 31వ తేదీన స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్నది. టికెట్ల ధరలు రూ.1,000, రూ.1,500, రూ.2,000, రూ.3,000, రూ.3,500, రూ.5,000, రూ.7,500గా నిర్ణయించారు. విశాఖలో జరిగే ఇంటర్నేషనల్ వన్డే, టీ-20 మ్యాచ్‌లకు ఆన్‌లైన్‌లో కాకుంటే ఆఫ్‌లైన్ ద్వారానైనా టికెట్ పొందేందుకు అవకాశం ఉండేది. కానీ, ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకాలు కేవలం ఆన్‌లైన్‌కు మాత్రమే పరిమితం చేశారు. ఈనెల 31వ తేదీన జరిగే మ్యాచ్‌లో ధోనీ ఆడనుండడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ధోనీ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పడం, రానున్న ఐపీఎల్ సీజన్‌లో ఆడే అవకాశాలు తక్కువగా ఉండడం, దాదాపు ఐదేళ్ల తర్వాత విశాఖలో ఆడనుండడం, పైగా చెన్నై సూపర్‌కింగ్స్ ఐపీఎల్‌లో బలమైన జట్టు కావడం వంటి అనేక కారణాలు మ్యాచ్‌పై క్రేజ్‌ను పెంచాయి. అయితే అమ్మకానికి ఎన్ని టికెట్లు అందుబాటులో పెడుతున్నారనే లెక్కలను నిర్వాహకులు వెల్లడించలేదు. స్టేడియం సామర్థ్యం 25 వేలు కాగా అందులో ఎన్ని టికెట్లను ఆన్‌లైన్‌లో అమ్మబోతున్నారనే దానిపై స్పష్టమైన సమాచారం లేదు. ఈ మ్యాచ్ టికెట్లను ఇప్పటికే బ్లాక్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు రాక రేపు

ఈనెల 31న ఢిల్లీ క్యాపిటల్స్‌లో తలపడనున్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు గురువారం నగరానికి రానుందని తెలిసింది. మంగళవారం చెన్నైలో గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ ఆడిన చెన్నై సూపర్‌కింగ్స్, బుధవారం అక్కడే విశ్రాంతి తీసుకుని గురువారం మధ్యాహ్నానికి విశాఖ చేరుకుంటుంది. విమానాశ్రయం నుంచి ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు చేరుకుంటుంది. గురువారం సాయంత్రం, శుక్రవారం నెట్ ప్రాక్టీసు చేసే అవకాశాలు ఉన్నాయి. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ ఈనెల 28న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ ఆడి, మర్నాడు ఉదయం అక్కడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

వెజిట్రబుల్ మార్కెట్

మెయిన్‌రోడ్డుపై కూరగాయల దుకాణాలతో ట్రాఫిక్ సమస్యలు



డిగ్రీ కాలేజీ సమీపంలో మెయిన్ రోడ్డు పక్కన కూరగాయ మార్కెట్

- కరోనా సమయంలో ఇందిరా మార్కెట్ నుంచి ఇక్కడికి తరలింపు
- తరువాత వ్యాపారులను తిరిగి వెనక్కి పంపడంలో అధికారులు విఫలం
- వాహనాల రాకపోకలకు తప్పని ఇబ్బందులు

నర్సీపట్నం, మార్చి 26: **నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం- చింతపల్లి రోడ్డులో కూరగాయల మార్కెట్ కొనసాగుతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు నాలుగేళ్ల క్రితం కరోనా వైరస్ (కొవిడ్-19) ప్రబలి సమయంలో ఇందిరా మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారులను అధికారులు ఇక్కడికి తరలించారు. అయితే మళ్లీ యథాస్థానానికి తరలించడంలో విఫలమయ్యారు. దీంతో ఇందిరా మార్కెట్‌లోని దుకాణాలు వృథాగా ఉండడంతో పాటు మెయిన్‌రోడ్డుపై మార్కెట్ నిర్వహించడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.**

నర్సీపట్నం నడిబొడ్డున అబీద్ సెంటర్‌లో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఎన్నో ఏళ్ల నుంచి ఇందిరా మార్కెట్ ఉంది. ఇందులో పక్కా షాపులు 137 ఉన్నాయి. ఇవి కాకుండా నేల దుకాణాలు, రేకుల షెడ్లు వేసుకొని కూరగాయలు విక్రయించేవారు. దుకాణాల అద్దెల ద్వారా ఏడాదికి రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఆశీలు వేలం పాట ద్వారా ప్రతి సంవత్సరం రూ.20 లక్షల ఆదాయం వచ్చేది.



స్తంభించిన ట్రాఫిక్

అయితే 2020వ సంవత్సరంలో కొవిడ్ వచ్చినప్పుడు జన సమూహం ఒకేచోట ఉండకూడదన్న కారణంతో ఇందిరా మార్కెట్లోని కూరగాయల వ్యాపారులను చింతపల్లి రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు తరలించారు. రోడ్డుకు ఇరువైపులా షెడ్లు వేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే కరోనా పోయిన ... మిగతా 8వ పేజీలో

కిరాణా షాపు యజమానికి సైబర్ నేరగాళ్లు టోకరా

- రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.3 లక్షలు తస్కరణ
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



పాయకరావుపేట, మార్చి 26 : పట్టణంలోని ఓ కిరాణా షాపు యజమాని బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.3 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు తస్కరించారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు. పాయకరావుపేటలో డీసీసీబీ బ్యాంకు పక్కన ఉన్న కిరాణా షాపు వద్దకు గుర్తు తెలియని వ్యక్తి ఒకరు వచ్చి సుమారు రూ.6 వేల విలువైన సరకులు కొనుగోలు చేశాడు. డబ్బులను ఫోన్ పే ద్వారా చెల్లిస్తానని చెప్పడంతో యజమాని రెడ్డి అప్పారావు సరే అన్నాడు. ఇంతలోనే ఆ వ్యక్తి.. తన సెల్ ఫోన్‌లో ఫోన్ పే కావడంలేదని, తన స్నేహితుడి సెల్ నంబర్‌కు ఒక రూపాయి ఫోన్ పే ద్వారా చెల్లిస్తే అతను రూ.6 వేలు పేమెంట్ చేస్తాడని చెప్పాడు. దీంతో షాపు యజమాని తన సెల్ నుంచి రూపాయి ఫోన్ పే చేశాడు. అది ఫెయిల్ రావడంతో షాపు యజమాని తన రెండో నంబరుతో మరో రూపాయి ఫోన్ పే చేశాడు. అయితే అది కూడా ఫెయిల్ రావడంతో.. కిరాణా సరకులు ఇక్కడే వుంచడి, చికెన్ సెంటర్‌కు వెళ్లి డబ్బులు తీసుకువచ్చి సరకులు తీసుకెళతానని చెప్పి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికి షాపు యజమాని అప్పారావు సెల్‌కి రెండు మెసేజ్‌లు వచ్చాయి. ఒక ఖాతా నుంచి రూ.99,000, మరో ఖాతా నుంచి రూ.30,900 డెబిట్ అయినట్టు సమాచారం వచ్చింది. దీంతో షాపు యజమాని లబోదిబోమంటూ కిరాణా సరకులు కొనుగోలు చేసిన వ్యక్తి కోసం సమీపంలోని చికెన్ సెంటర్ల వద్దకు వెళ్లి వెతికాడు. కానీ అతను కనిపించకపోవడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.13
సహారి (గురు)	4.42

వైసీపీ ఎన్నికల స్టంట్!

ఐదేళ్ల నుంచి పందూరు వంతెన నిర్మాణాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

- టీడీపీ హయాంలోనే సగానికిపైగా పనులు పూర్తి
- ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావిడిగా రెండోసారి శంకుస్థాపన
- టెండర్లు పిలవక ముందే అమల్లోకి ఎన్నికల కోడ్
- వంతెన నిర్మాణంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదంటున్న స్థానికులు



పందూరులో పిల్లర్ల దశలోనే ఆగిన వంతెన నిర్మాణం

కోటవురట్ల, మార్చి 26: ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదు. కొత్తగా అభివృద్ధి పనులు ప్రకటించడకూడదు. కానీ వైసీపీ పాలకులు ప్రజలను మభ్యపెట్టడానికి సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే వేళ కోటవురట్ల మండలం పందూరు వద్ద వంతెన పెండింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. వాస్తవంగా ఈ వంతెన నిర్మాణం టీడీపీ హయాంలోనే మొదలైంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ఆపేశారు. దీంతో పలు గ్రామాల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఐదేళ్లపాటు ప్రజల కష్టాలు పట్టించుకోని వైసీపీ పాలకులు, ఎన్నికలు ముంచుకొస్తుడడంతో జనాన్ని మభ్యపెట్టడానికి వంతెన పెండింగ్ పనులకు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. 'చెల్లి పెళ్లి.. జరగాలి మళ్లీ మళ్లీ..' అన్న సినిమా డైలాగ్ చందంగా వైసీపీ ప్రభుత్వం తీరు వుందని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.

కోటవురట్ల మండలం మీదుగా వెళుతున్న వరహా నదిలో 2012 నవంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో వరద నీరు పోటెత్తడంతో పందూరు వద్ద వంతెన కొట్టుకుపోయింది. దీంతో పందూరు, బంద, బుడగలలోవ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం కోసం రాష్ట్ర విభజనకు ముందు 2013లో రూ.6 కోట్లును అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తయిన తరువాత 2014 ఏప్రిల్‌లో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ జరిగింది. 2015 మార్చి 5న అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2017 డిసెంబరునాటికి శ్లాబ్ మినహా మిగిలిన పనులు పూర్తయ్యాయి. నిధులు మంజూరు అయ్యేనాటికి వున్న ధరలతో పోలిస్తే నిర్మాణ సామగ్రి ధరలు బాగా పెరగడంతో ప్రభుత్వం కేటాయించిన రూ.6 కోట్లతో ఇంతవరకే పనులు అయ్యాయంటూ కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అధికారులు మళ్లీ అంచనాలు తయారు చేసి రూ.3 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తరువాత 2018 అక్టోబరుతో కాంట్రాక్టు గడువు ముగియడం, మరుసటి ఏడాది ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ (ఉపాధ్యాయ) ఎన్నికల కోడ్, మార్చిలో సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వం నిధులు విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడింది. సాధారణ ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు మిగిలిన అభివృద్ధి పనుల మాదిరిగానే పందూరు వంతెనను కూడా అటకెక్కించారు. అప్పటి నుంచి నిధులు మంజూరు చేయాలని ఏటా ప్రతిపాదనలు పంపడం, రాజధాని స్థాయిలో బుట్టదాఖలు చేయడం ఆనవాయితీగా మారింది. వరహా నదిపై వంతెనలేకపోవడంతో వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. నదిలో నుంచి రాకపోకల కోసం పంచాయతీ అధికారులు తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు నిర్మించారు. వరద వచ్చినప్పుడల్లా ఇది కొట్టుకుపోతున్నది. సమస్య మళ్లీ మొదటికి వస్తున్నది. గడప గడప ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పందూరు వచ్చి ఎమ్మెల్యే బాబురావును వంతెన నిర్మాణంపై గ్రామస్థులు నిలదీశారు.

నాలుగున్నరేళ్ల తరువాత మళ్లీ శంకుస్థాపన!

పందూరు వద్ద వరహా నదిపై అసంపూర్తిగా వున్న వంతెన నిర్మాణ పనులు పూర్తిచేయడానికి రూ.5.75 కోట్ల ... మిగతా 8వ పేజీలో

ఇంకా ఐదు రోజులే!

- నెలాఖరు వరకే ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ అవకాశం
- బకాయిలు మొత్తం ఒకేసారి చెల్లించే వారికి వర్తింపు



నర్సీపట్నం మునిసిపల్ కార్యాలయం

నర్సీపట్నం, మార్చి 26 : ఆస్తి పన్ను వడ్డీ రాయితీ పొందడానికి ఐదు రోజులే గడువు మిగిలి ఉంది. ఆస్తి పన్ను బకాయిలు మొత్తం ఈ నెలాఖరులోగా చెల్లించి పూర్తిగా వడ్డీ రాయితీ పొందాలని కమిషనర్ పూడి రవిబాబు మునిసిపాలిటీలోని వివిధ ఆస్తుల యజమానులకు పిలుపు నిచ్చారు. 2023-24 అసెస్‌మెంట్ ప్రకారం పురపాలక సంఘం పరిధిలోని నర్సీపట్నం, పెదబొడ్డేపడ్డేపల్లి, బలిఘట్టంలో మొత్తం 13,932 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులు వున్నారు. వీరు రూ.4.88 కోట్లు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. మునిసిపల్ అధికారులు వడ్డీ రాయితీ పథకంపై విస్తృత ప్రచారం చేశారు. కిందిస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆస్తి పన్ను బకాయిల చెల్లింపు గురించి యజ మానులకు వివరించారు. దీంతో ఇంతవరకు 10,516 ఆస్తులకు సంబంధించి రూ.3.68 కోట్ల పన్నులు వసూలయ్యాయి. మిగిలిన 3,416 మంది నుంచి రూ.1.2 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇంకా 1145 ఖాళీ స్థలాలకు రూ.26 లక్షలు పన్ను బకాయిలు ఉన్నాయి.

నెలాఖరు వరకే వడ్డీ రాయితీ అవకాశం

మునిసిపల్ రెవెన్యూ విభాగం అధికారులు ఏటా రెండు దఫాలుగా (ఆరు నెలలకు ఒకసారి) ... మిగతా 8వ పేజీలో

రోడ్డు పనులకు అటవీశాఖ బ్రేకులు

హద్దులు నిర్ణయించకముందే శంకుస్థాపన చేసిన వైసీపీ ప్రజాప్రతినిధులు

- వర్షంపడితే పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు



ఐదో మైలురాయి- జిల్లేడపూడి మధ్య రోడ్డు నిర్మించాల్సిన అటవీ శాఖ భూమి



రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న అటవీ శాఖ సిబ్బంది (ఫైల్ ఫొటో)

గొలుగొండ, మార్చి 26: **మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఐదో మైలురాయి నుంచి కొత్తఎల్లవరం గ్రామపంచాయతీ శివారు జిల్లేడపూడి వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. తమ శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు మంజూరైనప్పటికీ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి సరిహద్దులు నిర్ణయించనందున పనులు ఆపేసినట్టు సిబ్బంది చెబుతున్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు ముందుచూపు లేకుండా, ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఉద్దేశంతోనే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.**

మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఐదో మైలురాయి నుంచి కొత్తఎల్లవరం గ్రామపంచాయతీ శివారు జిల్లేడపూడి వరకు రోడ్డు నిర్మిస్తే రవాణా పరంగా తమ సమస్య తొలగుతుందని జిల్లేడపూడి, కొత్తఎల్లవరం, కరక, కశిమి గ్రామాల ప్రజలు అధికారులను కోరారు. సుమారు 20 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ప్రణాళికను తయారు చేశారు. రోడ్డు నిర్మించే ప్రదేశం అటవీ శాఖ పరిధిలో వుండడంతో ఆ శాఖ నుంచి అనుమతులు సైతం పొందారు. దీంతో ఈ నెల 14వ తేదీన ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల వైసీపీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, తదితరులు రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. అయితే ఫారెస్ట్ అధికారులకు ఎటువంటి సమాచారం లేకుండా పనులు ప్రారంభించారు. దీంతో మరుసటి రోజే అటవీ శాఖ సిబ్బంది వచ్చి పనులు నిలుపుదల చేయించారు. అటవీ శాఖపరిధిలో రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చినప్పటికీ సరిహద్దులు ఇంకా నిర్ణయించని కారణంగా పనులు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. కాగా పనులు నిలిచిపోవడంతో ఈ రోడ్డుపై చిన్నపాటి వర్షపు జల్లులుపడినా రాకపోకలకు ఇబ్బందులు పడతామని జిల్లేడపూడి, కొత్తఎల్లవరం, కరక, కశిమి గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీనిపై పీఆర్ డీఈ ఈశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఆరిలోవ అటవీ ప్రాంతంలో హద్దులు నిర్ణయించిన అనంతరం పనులు ప్రారంభించాలని, అంతవరకు పనులు చేయవద్దని అటవీ శాఖ నుంచి తమకు సమాచారం అందించారన్నారు. త్వరలో హద్దులు నిర్ణయించి పనులు పునఃప్రారంభిస్తామని చెప్పారు.

క్రైం... crime news

రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన వ్యక్తి (ఇన్‌సెట్‌లో) మృతుడి చేతిపై ఉన్న ఇంగ్లిష్ అక్షరాలు

అనకాపల్లి టౌన్, మార్చి 26: రైల్వేస్టేషన్ సమీపంలోని విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి రైలు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె.శాంతారామ్ వెల్లడించిన సమాచారం మేరకు.. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రైల్వే లైన్ పక్కన విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద ఒక వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉన్నట్టు సోమవారం రాత్రి ప్రభుత్వ రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తికి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి పది గంటల తర్వాత మృతిచెందాడు. ఇతని వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వుంటుందని, చేతి మీద 'బీఎస్ఎం' అని ఇంగ్లిష్‌లో పొడి అక్షరాలు ఉన్నాయి. ఇంతకు మించి మరే ఆధారాలు అతని వద్ద లభ్యం కాలేదు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలో మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ.. మహిళ మృతి

కశింకోట, మార్చి 26: మండలంలోని జి.భీమవరం సమీపంలో వంతెన వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్ బాబు తెలిపిన వివరాలిలా వున్నాయి. రావికమతం మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన శంకు మహాలక్ష్మమ్మ (65), తన అల్లుడు సురవరపు రాముతో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం మధ్యాహ్నం రాంబిల్లి మండలం వెంకటాపురంలో బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా దారిలోఓ జి.భీమవరం సమీపంలో వెనుక నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొన్నది. దీంతో మహాలక్ష్మమ్మ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతిచెందింది. ఆమె అల్లుడు సరవరపు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎలమంచిలి, మార్చి 26: ప్లబింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ కింద పడిపోయి తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు అందించిన వివరాల ప్రకారం.. ఎలమంచిలి మునిసిపాలిటీ రామ్‌నగర్‌కు చెందిన శీరందాసు ప్రేమ్ కుమార్(25) ఈ నెల 13వ తేదీన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల భవనం మరుగుదొడ్డిలో ప్లంబింగ్ పనులు చేస్తూ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఎలమంచిలిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు చెప్పారు.

రైలు ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థికి గాయాలు

ఎలమంచిలి, మార్చి 26: ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో పాలిటెక్నిక్ విద్యార్థి ఒకరు గాయపడ్డాడు. సంఘటన గురించి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్ప డంతో, అతని స్నేహితుడు వచ్చి, క్షతగాత్రుడిని ఎలమం చిలి సీహెచ్‌సీకి తరలించాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురానికి చెందిన ఎం.చంద్రమౌళి అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం సొంతూరు నుంచి రైలులో వస్తుండగా ఎలమంచిలి వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్రగాయం కావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్న చంద్రమౌళి స్నేహితుడికి ఫోన్ చేసి, ఆస్పత్రికి తీసుకెళ్లాలని కోరారు. దీంతో స్నేహితుడు ఎలమంచిలి వచ్చి చంద్రమౌళిని ఎలమంచిలి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. తలకు తీవ్రగాయం కావడంతో వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా ప్రమాదం ఎలా జరిగిందో చెప్పలేకపోతున్నాడని వైద్య సిబ్బంది తెలిపారు.

మూడు గ్రావెల్ లారీల పట్టివేత

పరవాడ, మార్చి 26: గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పట్టుకున్నామని గనుల శాఖ రాయల్టీ విభాగం ఆర్ఐ స్వాతి తెలిపారు. పెదముషిడివాడ రెవెన్యూ పరిధి నుంచి ఎటు వంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్ఐ స్వాతి సోమవారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి లంకెలపాలెంలో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా మూడు లారీలను పట్టుకున్నారు. గ్రావెల్ తవ్వకాలు, రవాణాకు సంబంధించి వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో లారీలను పరవాడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎంతమేరకు గ్రావెల్ తవ్వకాలు చేపట్టారో కొలతలు తీసిన అనంతరం అపరాధ రుసుము విధిస్తామని, అప్పటి వరకు వాహనాలు పోలీసుల అదుపులోనే ఉంటాయని స్వాతి తెలిపారు.

15 మద్యం సీసాలు స్వాధీనం, ఇద్దరి అరెస్టు

పరవాడ, మార్చి 26: ఇద్దరు వ్యక్తుల నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. పరవాడకు చెందిన దొడ్డి యశోదకృష్ణ, తానాం గ్రామానికి చెందిన అల్లు లక్ష్మణరావు ప్రభుత్వ దుకాణం నుంచి మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. దారిలో తనిఖీలు నిర్వహించిన సీఐ బాలసూర్యారావు.. వీరిద్దరి నుంచి మద్యం సీసాలను పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

సారా, మద్యం కేసుల్లో ఇద్దరి అరెస్టు

- పది లీటర్లు సారా, 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కృష్ణాదేవిపేట, మార్చి 26: సారా, మద్యం కేసుల్లో ఇద్దరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన చిక్కాల అప్పలరాజు 10 మద్యం బాటిళ్లను బెల్ట్‌షాపునకు మంగళవారం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ షేక్ రెహమాన్ తెలిపారు. అలాగే కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన పప్పుల జ్యోతి పది లీటర్ల సారాను విక్రయించేందుకు తీసుకువెళుతుండగా కొంగసింగి రహదారిలో గల రత్నంపేట జంక్షన్‌లో పట్టుకుని ఆమెపై కేసులు నమోదు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

27 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 26: మద్యం తరలిస్తున్న ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసి 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీసు స్టేషన్ హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. జమాదులపాలెం గ్రామానికి చెందిన చందనాల రాజు 14 మద్యం బాటిళ్లు తీసుకువెళ్తూ గూడ్స్‌షెడ్ వద్ద పట్టుబడ్డాడని, అలాగే నూకాంబిక ఆలయ ప్రాంతంలో నివాసముంటున్న నాగేంద్ర వెంకటరామయ్య అనే వ్యక్తి 13 మద్యం బాటిళ్లతో చింతావారివీధిలో దొరికాడని తెలిపారు.

వాడచీపురుపల్లిలో 10 మద్యం సీసాలు పట్టివేత

పరవాడ, మార్చి 26 : మండలంలోని వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన జె.గౌరీశంకరరావు మంగళవారం రాత్రి స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకు వెళుతుండగా పట్టుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

7 నుంచి 'నూకాంబిక' కొత్త అమావాస్య జాతర

- భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలి
- సమీక్షా సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ


వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 26: స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏప్రిల్ ఏడో తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో చిన్నికృష్ణ పలు శాఖల అధికారులను కోరారు. అమ్మవారి జాతర ఏర్పాట్లపై ఆలయ ఈవో (అసిస్టెంట్ కమిషనర్) కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ అధికారులు ఆలయ పరిసరాలతో పాటు ఆలయానికి వచ్చే మార్గాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా వుంచాలని స్పష్టం చేశారు. ఆది, మంగళ, గురువారాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందుబాటులో వుంచాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారిలో అమ్మవారి ముఖద్వారం నుంచి ఆలయానికి వచ్చే మార్గం, ఆలయం నుంచి పూల్‌బాగ్ వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చూడాలన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతర జరిగే నెల రోజులపాటుఐ ఆలయం వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని పీటీడీ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం, మత్తు పదార్థాల అమ్మకాలు జరగకుండా ఎక్సైజ్ అధికారులు గట్టి నిఘా పెట్టాలని చెప్పారు. సమావేశంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆలయ ఈవో బండారు ప్రసాద్, డీఎస్పీ ఎస్.అప్పలరాజు, సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు, ఎక్సైజ్ సీఐ కుమారి, ఆర్ఐ రమేశ్, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారి సుమిత్ర, పీటీడీ ఏడీఎం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 22 నుంచి అమ్మవారి మూలవిరాట్ దర్శనం


విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

నూకాంబిక అమ్మవారి ఆలయంలో వచ్చే నెల 22వ తేదీ నుంచి భక్తులకు అమ్మవారి మూలవిరాట్ దర్శనం కల్పిస్తామని, అప్పటి వరకు బాలాలయంలోనే అమ్మవారిని దర్శించుకోవాలని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత చెప్పారు. ఆర్డీవో సమీక్ష అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి ప్రారంభమవుతుందని, మే ఏడో తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. వేసవి కారణంగా క్యూ లైన్లలో నిల్చునే భక్తులు ఇబ్బందులు పడకుండా తాటాకు పందిళ్లు వేయిస్తున్నామని తెలిపారు. క్యూ లైన్లలో భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ, చంటిపిల్లలకు పాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీసీ చెప్పారు.

టీడీపీ విశాఖ అధ్యక్షుడిగా గండి బాబ్జీ



విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ నియమితులయ్యారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మంగళ వారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం పార్టీ అధ్యక్షునిగా ఉన్న పల్లా శ్రీని వాసరావు వచ్చే ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేయబోతున్నారు. పల్లా శ్రీనివాసరావు సుమారు నాలుగేళ్లు అధ్యక్ష పదవిలో కొనసాగారు. గండి బాబ్జీ మూడేళ్లుగా విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే, పొత్తులో భాగంగా 'సౌత్' సీటు జనసేనకు దక్కింది. ఈ నేపథ్యంలో బాబ్జీకి సముచిత స్థానం కల్పించాలని భావించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షునిగా నియమించారు. ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరం మండలం మొగలిపురం గ్రామానికి చెందిన గండి బాబ్జీ బీఎల్ పట్టభద్రులు. తొలుత కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి పలు పదవులను అలంకరించిన తరువాత 2004లో పెందుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రెండు పర్యాయాలు అదే స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరిన బాబ్జీకి 2020లో విశాఖ దక్షిణ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి నియోజక వర్గంలో కేడర్‌ను సమన్వయం చేస్తూ ప్రభుత్వ విధానాలపై పోరాటాన్ని సాగించారు.

కూటమి విజయానికి కృషి

విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు అధినేత చంద్రబాబునాయుడుకు గండి బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకువెళతానన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన వ్యూహాల మేరకు పనిచేసి ఫలితాలను రాబడతామని బాబ్జీ వెల్లడించారు.

'ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఉద్యోగిపై చర్యలు తీసుకోండి'


ఎమ్మెల్యే గణేశ్ పక్కన నిల్చొని ఉన్న అప్పలనాయుడు

నర్సీపట్నం, మార్చి 26: ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన సేంద్రియ వ్యవసాయం జీరో బడ్జెట్ నేషన్ ఫార్మింగ్ (జెడ్బీఎన్ఎఫ్) ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని అమలాపురం గ్రామానికి చెందిన పైల గంగాధర్ మంగళవారం నర్సీపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాంకి ఫిర్యాదు చేశారు. అమలాపురం శివారు గ్రామం పాత ఉప్పర గూడేనికి చెందిన జెడ్బీఎన్ఎఫ్ ఉద్యోగి పిండి అప్పలనాయుడు ఈ నెల 24వ తేదీన రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారని, స్థానిక ఎమ్మెల్యే గణేశ్‌తో గ్రూప్ ఫొటో దిగి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌వర్మ

పరవాడ, మార్చి 26: పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇనివ్వాలని, తద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌వర్మ పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలోని ఎంఎస్ఆర్ఎం భవనం వద్ద మంగళవారం నిర్వహించిన జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారులు జె.శివశంకర్‌రెడ్డి, జీవీవీఎస్ నారాయణరావు, ఎంఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ రావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు రామ్మోహనరావు, రామరాజు, సునీల్‌రాయ్ వాద్వా, గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశంలో పాల్గొన్న వలంటీర్ విధుల నుంచి తొలగింపు


వృత్తంలో ఉన్న వలంటీర్ ప్రసాద్

అనకాపల్లి టౌన్, మార్చి 26: గ్రామ/ వార్డు వలంటీర్లు రాజకీయ పార్టీల సమావేశాల్లో పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ స్పష్టంగా చెబుతున్నప్పటికీ స్థానిక 10వ సచివాలయం వార్డు వలంటీర్ వైసీపీ సమావేశంలో పాల్గొన్నారు. దీంతో అతనిని విధుల నుంచి తొలగిస్తూ జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. కోట్నివీధిలో ఈ నెల 24వ తేదీ రాత్రి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సమావేశం జరిగింది. దీనికి 10వ వార్డు సచివాలయ వలంటీర్ ఎ.ప్రసాద్ హాజరయ్యాడు. దీనిపై కొంతమంది వ్యక్తులు సీ-విజల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించిన అనంతరం వలంటీర్ ప్రసాద్‌ను విధుల నుంచి తొలగించినట్టు జోనల్ మిషనర్ మంగళవారం తెలిపారు.

ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏసుదాసు


గనిశెట్టి ఏసుదాసు

ఎలమంచిలి, మార్చి 26: ఏఐటీయూసీ జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గనిశెట్టి ఏసుదాసు ఎన్నికయ్యారు. ఎలమంచిలికి చెందిన ఇతను సుమారు 28 సంవత్సరాల నుంచి కార్మికుల హక్కుల సాధన, సమస్యలపై పోరాడుతున్నారు. ఇందుకు గుర్తింపుగా తనకు ఈ పదవి లభించిందని ఏసుదాసు చెప్పారు. కాగా ఏఐటీయూసీ జిల్లా కమిటీలో ఎలమంచిలికి చెందిన వీసం వెంకటరమణ, అడ్డరోడ్డుకు చెందిన భవర్‌లాల్ రాజులకు స్థానం లభించింది.

విశాఖ విమానాశ్రయం రన్‌వే రీ సర్ఫేసింగ్ పనులు పూర్తి

- ఏప్రిల్ 1 నుంచి 24 గంటలు రాకపోకలు

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో రన్ వే రీ సర్ఫేసింగ్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. గత ఏడాది నవంబరు 15న వీటిని ప్రారంభించారు. మార్చి 31తో పూర్తి చేయాల్సి ఉంది. అనుకున్న ప్రకారమే నేవీ వీటిని పూర్తిచేస్తోంది. ఈ పనుల కోసం విమానాశ్రయం పని వేళలను కుదించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే పౌర విమానాలను అనుమతిస్తున్నారు. ఆ ప్రకారమే విమాన సంస్థలు వింటర్ షెడ్యూల్ ప్రకటించాయి. అయితే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త రన్ వే పూర్తిగా అందుబాటులోకి రానుంది. ఆ రోజు నుంచి 24/7 విమానాల రాకపోకలు ఉంటాయని నేవీ ప్రకటించింది.

తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, మునిసిపల్, విద్యుత్ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు ఎదురైనట్టు సమాచారం అందినే వెంటనే స్పందించాలని సూచించారు. మరమ్మతులకు గురైన బోర్లను తక్షణమే బాగుచేయించాలన్నారు. భూగర్భ జలాల లభ్యతనుబట్టి తాగునీరు సరఫరాను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్ ఇన్‌చార్జి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యం

మాకవరపాలెం, మార్చి 26: అత్తవారింటి నుంచి ఇద్దరు పిల్లలతో సహా తన కుమార్తె అదృశ్యమైందని ఆమె తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జి.కోడూరు గ్రామానికి చెందిన భీశెట్టి వనజ(23)కి అదే గ్రామానికి చెందిన సంతోశ్ కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి లావణ్య, చందన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తలకు గొడవలు జరిగితే వనజ తండ్రి జోగి అప్పారావు సర్ది చెప్పి అత్తవారింటికి పంపాడు. మూడు నెలల క్రితం ఇద్దరు పిల్లలతో అత్తవారింటికి వెళ్లిన వనజ సోమవారం మధ్యాహ్నం అదృశ్యమైంది. బంధువుల ఇంటి వద్ద వెదికినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి మంగళవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

జీడితోటలు దగ్ధం

మాడుగుల రూరల్, మార్చి 26: మండలంలోని జాలంపల్లి పంచాయతీ రాచగొప్పూరు గ్రామంలో మంగళవారం ఐదెకరాల జీడితోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన కుర్జి పెంటారావు, బోయిన గొంతురాజులకు చెందిన ఐదెకరాలు జీడితోటలకు మంగళవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించి కాలిపోయాయి.

అద్దాల మండపంలో ఉపమాక వెంకన్న

- నేత్రపర్వంగా స్వామివారి రథోత్సవం


అద్దాల మండపంలో స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

నక్కపల్లి, మార్చి 26: ఉపమాక క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి కల్యాణ వేంకటేశ్వరుడి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. పుష్పమాలలతో అలంకరించిన రథంపై వేంకటేశ్వరుడిని ఆశీనులనుగావించి భక్తుల గోవిందనామస్మరణల మధ్య మాడవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. మంగళవారం వేకువజాము నుంచి రాత్రివరకు అద్దాల మండపంలో (శయన మందిరం) కల్యాణ వేంకటేశ్వరుడు విశేష దర్శనమిచ్చారు. కాగా స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి గురువారం వరకు పుష్పయాగోత్సవాలు జరుగుతాయని, 28వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు తెలిపారు.

శభాష్ అన్నపూర్ణమ్మ

- 95 ఏళ్ల వయసులో అవలీలగా గరుడాద్రి పర్వతం అధిరోహణ


స్వామి నిజరూపాన్ని దర్శించుకుంటున్న వయో వృద్ధురాలు వేదుల అన్నపూర్ణమ్మ

నక్కపల్లి, మార్చి 26: ఎస్.రాయవరం మండలం పెనుగొల్లుకు చెందిన 95 ఏళ్ల వేదుల అన్నపూర్ణమ్మ మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చారు. గరుడాద్రి పర్వతంపై స్వామివారి నిజరూపం దర్శనం చేసుకోడానికి మెట్ల మార్గంలో (సుమారు 360 మెట్లు) వెళ్లారు. గరుడాద్రి పర్వతాన్ని పది నిమిషాల్లో అవలీలగా అధిరోహించారు. తొమ్మిదిన్నర పదుల వయసులో కూడా అన్నపూర్ణమ్మ ఓపిక, సత్తువను చూసి సహచర భక్తులు ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను 40 సంవత్సరాల నుంచి ప్రతి శనివారం నీరు కూడా తీసుకోకుండా కఠిక ఉపవాసం ఉంటూ గోవిందనామ స్మరణ చేస్తున్నానని చెప్పారు.

బాల్య వివాహాలు చేసేవారిపై కఠిన చర్యలు

- ఐసీడీఎస్ పీవో జి. ఉషారాణి


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో ఉషారాణి

చోడవరం, మార్చి26: గ్రామాల్లో తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించే దిశగా ప్రోత్సహించాలని, బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీవో జి. ఉషారాణి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గవురవరం పీహెచ్‌సీలో బేటీబచావో బేటీపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలికల చదువుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని, ఆ దిశగా తల్లిదండ్రుల్లో చైతన్యం తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీ ఎస్ సిబ్బంది, గవరవరం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకులపై దాడి చేసిన వైసీపీ నేతను శిక్షించాలి

- గణేశ్ గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం నాయకుల డిమాండ్

చోడవరం, మార్చి26: ఆలయంలో భక్తుల సమక్షంలో అర్చకులపై దాడికి పాల్పడిన కాకినాడ వైసీపీ నాయకుడు సిరియాల చంద్రరావుపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గణేశ్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయాల్లోని అర్చకులపై ప్రతాపం చూపించి వారిపై అమానుషంగా దాడులకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కువయ్యాయని, ఇటువంటి అరాచక శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అర్చకులపై దాడికి పాల్పడిన సదరు నేతపై చర్యలు తీసుకోని పక్షంలో ఏపీ ప్రైవేటు అర్చక పురోహిత సంక్షేమ సంఘం తరఫున ప్రత్యక్ష పోరాటానికి తామంతా సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కందర్ప కృష్ణమూర్తి, కందర్ప రామేశం, పుట్రేవు శ్యాంప్రసాద్, వింజమూరి శంకర్, కొమ్మనమంచి నరసింహమూర్తి, ఉపాధ్యాయుల శ్రీనివాస్, కందర్ప సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాయిన్స్ ఆటాడుతున్న నలుగురి అరెస్టు

రోలుగుంట, మార్చి 26: మండలంలోని రోలుగుంటలో స్థానిక రైస్ గౌడాన్ వద్ద క్యాయిన్స్ ఆట ఆడుతున్న నలుగురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి కొండపాలేనికి చెందిన కర్రి శ్రీను, పోతు గణేశ్‌లను, రోలుగుంటకు చెందిన చిత్రాడ నాగరాజు, అంట్లపాలేనికి చెందిన రేగటి నాగరాజులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి నుంచి రూ.14,000 నగదును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

కె.కోటపాడు, మార్చి 26: కె.కోటపాడు సమీపంలో మంగళవారం నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన కె.కార్తీక్ మంగళవారం తెల్లవారుజామున పాడేరులో నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి వస్తుండగా కె.కోటపాడు సమీపంలో పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అతనిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

20 లీటర్ల నాటుసారాతో ఒకరి అరెస్టు

రావికమతం, మార్చి 26: మండలంలోని పిల్లవానిపాలెం గ్రామంలో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశామని రావికమతం ఎస్ఐ ధనుంజనాయుడు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పిల్లవానిపాలెం గ్రామంలో మంగళవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన ఎం.రాము తయారు చేసి విక్రయానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారాతో పాటు తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లం పులుసును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడు రామును అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.

నూకాంబికను దర్శించుకున్న సీఎం రుత్విక్



రుత్విక్‌కు చిత్రపటం అందిస్తున్న జయవీర్

అనకాపల్లి టౌన్, మార్చి 26 : స్థానిక నూకాంబిక అమ్మవారిని మంగళవారం బీజేపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ తనయుడు రుత్విక్ దర్శించుకున్నారు. బాలాలయంలో దర్శనం అనంతరం టీడీపీ యువ నాయకుడు దాడి జయవీర్ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని రుత్విక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల అప్పలరాజు, భానుచందర్ పాల్గొన్నారు.

భారత వికాస పరిషత్ అధ్యక్షుడిగా ఎన్ఏబీ వర్మ

కొత్తూరు, మార్చి 26 : భారత వికాస పరిషత్ సర్వసభ్య సమావేశం అనకాపల్లి పట్టణంలోని ఏపీటీఎఫ్ భవనంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా 2024-2025 సంవత్సరానికి ఆంజనేయ ప్రసాద్ సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎన్ఏబీ. వర్మ, కార్యదర్శిగా దాడి శివరాము, కోశాధికారిగా ఏవీ.బ్రహ్మానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం 2023లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో పాఠశాలల్లో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులకు డిక్షనరీ, కండువా వేసి సత్కరించారు. సెప్టెంబరు 5న జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను శాలువా, పండ్లు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ పి.మహేశ్వరరావు, ఎస్.గోపాలరావు, కె.రమణ అప్పారావు, ఎస్.కోటేశ్వరరావు, వై.కేశవరావు, మూర్తి, ఓంరాము, త్రినాథరావు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో యువతకు అన్యాయం

- తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు

తుమ్మపాల, మార్చి 26: వైసీపీ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు విమర్శించారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. యువత భవిష్యత్తును జగన్‌రెడ్డి పూర్తిగా నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత చెడు మార్గాన్ని ఎంచుకుంటున్నారని, అందుకు వైసీపీ నాయకులు పూర్తిగా సహకరిస్తున్నారన్నారు. దీనికి విశాఖలో పట్టుబడిన 25వేల కిలోల డ్రగ్స్ నిదర్శనమన్నారు. మరో 40 రోజుల్లో జగన్‌రెడ్డి రాక్షస పాలన అంతం కాబోతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు కాయల ప్రసన్న, కార్యదర్శి భీశెట్టి హేమ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభావతి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి : ఆర్వో

నక్కపల్లి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి, సభలకు కచ్చితంగా అనుమతులు వుండాలని, అనుమతుల్లేకుండా ఎవరైనా ఎన్నికల ప్రచారం సాగిస్తే చర్యలు తప్పవని ఆర్వో కె.గీతాంజలి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఇక్కడ జరిగిన రాజకీయపార్టీల నాయకులు, సెక్టార్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మైక్‌సెట్ల ఏర్పాటు, వాహనాలకు లౌడ్ స్పీకర్లు, జెండాలు, కటౌట్లు ఇలా ఏం చేసినా అనుమతులు వుండాల్సిందేనని చెప్పారు. కోడ్ అమలుకు ప్రత్యేక బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఎప్పటికప్పుడు తిరుగుతాయని చెప్పారు.

ఫ్లై ఓవర్‌పై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ఎలమంచిలి, మార్చి 26: పట్టణంలోని కొక్కిరాపల్లి ఫ్లైఓవర్‌పై విద్యుత్ లైట్లు ఏర్పాటుకు స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఫ్లైఓవర్‌పై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. మంగళవారం బ్రిడ్జిపై క్రేన్ సాయంతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం ప్రారంభించారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి జోగులు ఎన్నికల ప్రచారం

ఎస్. రాయవరం, మార్చి 26: మండలంలోని జేవీ పాలెం, వేమగిరి, సైతారుపేట, పేటసూదిపురం గ్రామాల్లో మంగళవారం పాయకరావుపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, మాజీ ఎంపీపీ శారదాకుమారి, సీనియర్ నేత కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పారిపల్లెమ్మ అమ్మవారి పండగ

మునగపాక (తుమ్మపాల), మార్చి 26 : మండలంలోని వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. డీసీసీబీ మాజీచైర్మన్ యు. సుకుమారవర్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

29న ఉచిత పాలిసెట్ శిక్షణ శిబిరం

మునగపాక (తుమ్మపాల), మార్చి 26 : స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 29న మధ్యాహ్నం రెండు గంటలకు మునగపాక జడ్పీ హైస్కూల్‌లో పాలిసెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఎం.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆసక్తి గల వారు ఈ శిక్షణ శిబిరానికి హాజరుకావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8919360208 కు సంప్రదించాలని ఆయన కోరారు.

ఆలయాల్లో విశ్వబ్రాహ్మణులకు ధర్మకర్త పదవి : కొణతాల

కొత్తూరు, మార్చి 26 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశ్వ బ్రాహ్మణులకు ఆలయంలో ధర్మకర్త పదవి కేటాయిస్తామని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మంగళవారం అనకాపల్లి పట్టణంలోని ఒక కల్యాణ మండపంలో జరిగిన విశ్వబ్రాహ్మణ సోదరుల ఆత్మీయ సమావేశంలో అయన మాట్లాడారు. మంగళగిరిలో తెలుగుదేశం, జనసేన పార్టీలు విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌లో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వైశ్యాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. 50ఏళ్లు పూర్తయిన వారికి పెన్షన్ ఇస్తామన్నారు. బీసీలకు గతంలో ఉన్న 34 శాతం రిజర్వేషన్లు వైసీపీ ప్రభుత్వంలో 24శాతం చేయడం వల్ల 18వేల రాజకీయ పదవులు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో రూ.కోటితో సామాజిక భవనం ఏర్పాటు చేస్తామన్నారు. విశ్వ బ్రాహ్మణులందరూ ఆలోచన చేసి గాజుగ్లాసుపై ఓటు వేసి గెలిపించాలని రామకృష్ణ కోరారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, బీజేపీ నాయకులు కొణతాల అప్పలరాజు, 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి నీలబాబు, విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.



విశ్వ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కొణతాలకు ముస్లింలు మద్దతు

అనకాపల్లి టౌన్, మార్చి 26 : స్థానిక కోట్నివీధి, మళ్లవీధి కల్యాణ మండపాల్లో మంగళవారం జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ కాఫీ విత్ కేడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దోపిడీ, కక్ష సాధింపులు తప్ప రాష్ట్రంలో వైసీపీ చేసిందేమి లేదన్నారు. అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. రోడ్లు, డ్రైనేజి వంటి ముఖ్యమైన పనులు కూడా ఈ ప్రభుత్వం చేపట్టలేదన్నారు. ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరందించే సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేయడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు కొణతాలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, బీజేపీ నాయకులు గేదెల స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కొణతాల గెలుపు కోసం కూటమి నేతలు ప్రచారం

జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపు కోసం మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు దూలం ప్రసాద్, కర్రి మల్లేశ్వరరావు, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి గాజుగ్లాస్‌కు ఓటేసి కొణతాల రామకృష్ణను గెలిపించాలని కోరారు. అలాగే పలు ప్రాంతాల్లో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల శ్రీనివాసరావు, పీవీ రమణ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ మురళీ, కోరిబిల్లి పరమేష్, మారిశెట్టి భాస్కరరావు, విల్లూరి రమణబాబు, మైపాల గోపి తదితరులు పాల్గొన్నారు.



కొణతాలకు మద్దతు తెలుపుతున్న ముస్లిం సోదరులు

ఘనంగా పోలిపల్లి అమ్మవారి పండగ

తుమ్మపాల, మార్చి 26 : అనకాపల్లి మండలం తుమ్మపాలలో పోలిపల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డపాటి గంగాశ్రీను, బొడ్డపాటి రాజారావు, ఏరుబండి సత్యనారాయణ, పెంటకోట డొంకయ్యనాయుడు పాల్గొన్నారు.

మీ ఆడ బిడ్డను ఆదరించండి : వంగపూడి అనిత

కోటవురట్ల, మార్చి 26: ఎన్నికల్లో మీ ఇంటి ఆడబిడ్డగా తనను ఆదరించాలని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత కోరారు. మంగళవారం కూటమి అభ్యర్థి అనిత మండలంలోని గొట్టివాడ, యండపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తనను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఆదాయం మీద కూడా అప్పులు తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దుక్కుతుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జగన్ పాలనలో ధరలు పెరుగుదల, సంక్షేమ పథకాల కోత, అరాచక పాలనను ఆమె మహిళాలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడే జానకి శ్రీనివాసరావు, మండల ప్రధానకార్యదర్శి పెట్ల లింగంనాయుడు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, నాయకులు వేచలపు జనార్దన్, సుంకర్ బాబ్జి, యండపల్లి చంటి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి అనితను గెలిపించండి

పాయకరావుపేట, మార్చి 26 : రాష్ట్రంలో అరాచక, విధ్వంస పాలన చేస్తున్న వైసీపీని ఇంటికి పంపేందుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితకు ఓటేసి గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నూకాలమ్మగుడి వీధి, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి నాగవెంకటరమణ, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, సీహెచ్.పేర్రాజు, రాజాన ఆది, డి.శ్రీను పాల్గొన్నారు.



గొట్టివాడలో ఇంటింటా ప్రచారం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిత

ఘనంగా బాబూరావు జన్మదిన వేడుకలు

సబ్బవరం, మార్చి 26 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జి, పంచకర్ల రమేష్‌బాబు, పెందుర్తి నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు బాబూరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసకపల్లి శివారు ఎర్రవానిపాలెంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న కోన పైడికొండ కుటుంబానికి జిల్లా యాదవ సంఘం తరుపున బాబూరావు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాబూరావుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ, జనసేన నాయకులు ఇందలి వెంకటరమణ, మొల్లి ముత్యాలనాయుడు, గండి దేముడు, ముత్యాలనాయుడు, బలిరెడ్డి అప్పారావు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, గజ్జి నరసింగరావు, కోన సోమేశ్వరరావు, ఈపు అప్పలరాజు, దుక్క శ్రీను, కోన సోమేశ్వరరావు, బందం వెంకటరమణ, తదితరులు ఉన్నారు.



భరణికాన బాబూరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గండి బాబ్జి, పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ, జనసేన శ్రేణులు

'ఏటికొప్పాక షుగర్స్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి'

ఎస్. రాయవరం, మార్చి 26: మండలంలోని ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని మేనిఫెస్టోలో చేర్చాలంటూ మంగళవారం టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, వైసీపీ అభ్యర్థి కంబాల జోగులుకు వినతిపత్రాలు అందజేసినట్టు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా అనిత, జోగులు స్పందిస్తూ ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీని తెరిపించడానికి చర్యలు తీసుకుంటామని, ఈ విషయాన్ని మేనిఫెస్టోలో చేర్చుతామని హామీ ఇచ్చినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, సీఐటీయూ నాయకుడు ఎం. రాజేష్, ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు జి. గోవిందరావు, కె. సత్యనారాయణ, ఎ. నారాయణమూర్తి, కె.వెంకటేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

సందడిగా పైడిమాంబ జాతర

పరవాడ, మార్చి 26: స్థానిక పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంటన్నర నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి ఒంటిగంటకే క్యూలైన్లు అన్ని భక్తులతో నిండిపోయింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఉపసర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మవారి ఘటాలను ఊరేగించిన అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవాన్ని నిర్వహించారు.



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వెజిట్రబుల్ మార్కెట్

... 5వ పేజీ తరువాయి

తరువాత కూడా కూరగాయ వ్యాపారులను ఇందిరా మార్కెట్‌కు తిరిగి పంపించడంలో పోలీసులు, మండల పరిషత్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి.

రాకపోకలకు ఇబ్బందులు

చింతపల్లి రోడ్డులో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్ పక్కనే సర్పీపట్నం కోర్టు సముదాయం ఉంది. అలాగే ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా నేల దుకాణాలు, షెడ్లు ఉండడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మంగళ, గురు, శనివారాల్లో ఈ సమస్య మరింత అధికంగా వుంటున్నది. పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

ఎన్నికల విధులకు ఆటంకమే..

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ విభాగాలు ఏర్పాటు చేశారు. నోటిఫికేషన్ విడుదల నుంచి ఎన్నికల తేదీ వరకు నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు, ప్రత్యేక పోలీసు బలగాల వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. మెయిన్ రోడ్డులో సంత వల్ల ఎన్నికల సిబ్బంది, ఉన్నతాధికారుల రాకపోకలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని పలువురు అధికారులు అంటున్నారు. ఇందిరా మార్కెట్‌కు వ్యాపారులను తరలిస్తే ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీరుతుందని, అలాగే ఇందిరా మార్కెట్‌కు ఆశీలు రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పలువురు చెబుతున్నారు.

ఇందిరా మార్కెట్‌కు వెళ్లడానికి సిద్ధం

సుర్ల అప్పలనాయుడు, రైతు, పాములవాక, కోటవురట్ల మండలం



కూరగాయల మార్కెట్‌ను ఇందిరా మార్కెట్‌కి తరలిస్తే వెళ్లడానికి రైతులు అందరూ సిద్ధంగా ఉన్నారు. ఇందిరా మార్కెట్‌లో అయితే రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయి. అక్కడ ఉన్నప్పుడు వ్యాపారం కూడా బాగా సాగేది.

వైసీపీ ఎంపీ అభ్యర్థి 'బూడి'

... 5వ పేజీ తరువాయి

ఆమెను తాడేపల్లి పిలిపించుకొని మాట్లాడారు. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్తగా ఆమెను నియమిస్తారని ప్రచారం కూడా జరిగింది. కానీ పొత్తులో భాగంగా అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించడం, ఆ పార్టీ తరపున సీఎం రమేశ్ పేరు ఖరారు కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత బూడి ముత్యాల నాయుడును రంగంలోకి దించాలని నిర్ణయించారు. దీంతో గవర సామాజిక వర్గానికి ఇటు అసెంబ్లీకి, అటు లోక్‌సభకు పోటీ చేసే అవకాశాన్ని వైసీపీ పెద్దలు కల్పించలేదు.

వైసీపీ మాడుగుల అభ్యర్థిగా అనురాధ!?

మాడుగుల, మార్చి 26: ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధను మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం మంగళవారం ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో మాడుగుల నుంచి వైసీపీ అభ్యర్థిగా ఆమె పోటీ చేయడం దాదాపు ఖాయమైనట్టేనని నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్న ఈమె స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్థాయీ సంఘం చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1986 నవంబరు 4వ తేదీన బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులకు జన్మించిన అనురాధ.. ఇంటర్ వరకు చదివారు. భర్త ఈర్లె గంగునాయుడు. ఇతను గతంలో కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. వీరికి ఇద్దరు పిల్లలు.. కుమార్తె, కుమారుడు వున్నారు.

ఇంకా ఐదు రోజులే!

... 5వ పేజీ తరువాయి

ఆస్తి పన్ను వసూలు చేస్తుంటారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు మొదటి విడత పన్నును సకాలంలో చెల్లించకపోతే అక్టోబరు నుంచి నెలకు నూటికి రెండు రూపాయల చొప్పున వడ్డీ విధిస్తున్నారు. అదే విధంగా అక్టోబరు ఒకటి నుంచి మార్చి 31 వరకు రెండో దఫా పన్ను చెల్లించకపోయినా ఇదే నిబంధన వర్తిస్తుంది. అందువల్ల ఆస్తి పన్ను బకాయి వున్న వారికి వడ్డీ భారం పడకుండా ఈ నెలాఖరులోగా మొత్తం బకాయి చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కమిషనర్ కోరుతున్నారు.

వైసీపీ ఎన్నికల స్టంట్

... 5వ పేజీ తరువాయి

మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎట్టకేలకు ఇటీవల గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ నెల 11వ తేదీన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకంపై జోగులు పేరు లేదు. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పేరు వున్నప్పటికీ ఆయన ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇది జరిగిన సరిగ్గా ఐదు రోజులకు కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. వంతెన పనులకు ఇంతవరకు టెండర్లు పిలవలేదు. ఎన్నికలో కోడ్ అమల్లో వున్నంత కాలం టెండర్లు పిలవడానికి, పనులు ప్రారంభించడానికి వీలుకాదు.

సుమారు ఐదేళ్లపాటు వంతెన నిర్మాణం గురించి పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం, సరిగ్గా ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసి ప్రజలను మభ్యపెడుతున్నదని, ఇది పూర్తిగా ఎన్నికల స్టంట్ అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఆరోపిస్తున్నారు. పైగా గతంలో శంకుస్థాపన చేసి, సగం మేర పూర్తయిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా వుందని ఆమె అన్నారు.

దాడిని కలిసిన సీఎం రమేష్ సోదరుడు



దాడితో మాట్లాడుతున్న సీఎం రమేష్ సోదరుడు రాజేష్

అనకాపల్లి టౌన్, మార్చి 26 : స్థానిక లక్ష్మీనారాయణనగర్ డీవీఆర్ కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావును బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు రాజేష్, భారతీయ జనతాపార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దాడి వీరభద్రరావుతో రాజేష్ కొద్దిసేపు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించినట్టు డీవీఆర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. వీరితోపాటు దాడి రత్నాకర్‌ను కూడా ఉన్నారు.

వైభవంగా ఉమాధర్మలింగేశ్వరస్వామి కల్యాణం



ఉమాధర్మలింగేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాంబిల్లి, మార్చి 26 : ప్రముఖ శైవక్షేత్రం పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని సోమవారం అర్ధరాత్రి 12 గంటలు తరువాత కనుల పండుగగా నిర్వహించారు. స్వామివారి దంపతులను ప్రత్యేకంగా అలంకరించి, అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, అంకురార్పణ, పల్లకి సేవలను నిర్వహించారు. శుభ ముహూర్తాన స్వామివారి దంపతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు.

తేగాడ కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కశింకోట, మార్చి 26 : మండలంలోని తేగాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు.ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు.

ఫార్మా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

పరవాడ, మార్చి 26 : వ్యర్థ రసాయనాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్న ఫార్మా యాజమాన్యాలపై కఠిన చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తరచూ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెట్టి వాటికి నిప్పు పెట్టడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. సోమవారం పరవాడ చెత్త డంపింగ్ కేంద్రం పరిసరాల్లో ఫార్మా వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు

కోటవురట్ల, మార్చి 26: స్వేచ్ఛగా ఓటేయండనే సంకేతంతో ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపేలా కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు సోమవారం మండలంలోని యండపల్లి, కోటవురట్ల, చౌడువాడ, పందూరు, కైలాసపట్నం రాజుపేట, పాములవాక, బోడపాలెం, ఏఎస్‌పేటఅన్నవరం గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా నక్కపల్లి సీఐ అప్పన్న మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణయ్య పాల్గొన్నారు.

పైడిమాంబ అమ్మవారి ఆలయంలో పూజలు

రాంబిల్లి, మార్చి 26: మండలంలోని మామిడివాడలో నూతనంగా నిర్మించిన పైడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభ పూజలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 28వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు.

నేడు, రేపు ముత్యమాంబ అమ్మవారి జాతర

సబ్బవరం, మార్చి 26: మండలంలోని అంతకాపల్లి, రావలమ్మపాలెం, ఒమ్మివానిపాలెం, బంగారమ్మపాలెం, చినబంగారమ్మపాలెం, ఎ.సిరసపల్లి గ్రామాల్లో కొలువైన ముత్యమాంబ అమ్మవారి జాతరలో భాగంగా బుధవారం తొలేళ్లు, గురువారం అనుపోత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం తొలేళ్ల సందర్భంగా రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఘటాలు, గరగల ఊరేగింపు జరగనుంది. గురువారం అనుపోత్సవం సందర్భంగా వేకువ జామున 3 గంటల నుంచే అమ్మవారికి దూప దీప నైవేద్యాలు, పంచామృత అభిషేకాలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం బాణసంచా పేలుళ్లతో అనుపోత్సవం జరుగుతుంది. ఉత్సవ నిర్వాహకులు సబ్బవరపు త్రినాథ రామకాసు, సర్పంచ్ నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాయకరావుపేట, మార్చి 26 : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 132 కేవీ రైల్వే లైనును కొరుప్రోలు ఫీడర్‌పైకి మార్పు చేసే పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేట, నామవరం, సీతారాంపురం, పీఎల్.పురం, గుంటపల్లి, మంగవరం, శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, పెదరాంభద్రపురం, కేశవరం, రాజవరం, వెంకటనగరం, కుమారపురం, ఈదటం, పాల్మన్‌పేట, రాజయ్యపేట, నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామాల్లో బుధవారం, గురువారాల్లో మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

అచ్యుతాపురం, మార్చి 26: యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని స్వావలంబి భారత్ అభియాన్ జోనల్ ఇన్‌చార్జి అగ్గాల హనుమంతరావు అన్నారు. మంగళవారం స్థానిక క్రైట్స్ డిగ్రీ కళాశాలలో జరిగిన స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత స్వయం కృషితోపాటు ప్రభుత్వ సాయంతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కన్వీనర్ వెలగా జగన్నాథం,పారిశ్రామికవేత్త ముత్యాల నాయుడు, కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, ఆడారి అప్పలనాయుడు, ఎ.సన్యాసిరావు పాల్గొన్నారు.

కుమారపురంలో ఘనంగా సామూహిక హారతి

పాయకరావుపేట రూరల్, మార్చి 26 : మండలంలోని కుమారపురంలో గత 20 రోజులుగా జరుగుతున్న నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా సింహాద్రి అప్పన్న ఆలయం వద్ద గ్రామ దేవతల గరగలకు సోమవారం రాత్రి సామూహిక హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు నీలాపు అప్పలరెడ్డి, నీలాపు వెంకటరెడ్డి, కట్టా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఏఎస్పీ

ఎస్.రాయవరం, మార్చి 26: మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల పది పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి సత్యనారాయణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చీఫ్ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావుతోపాటు అక్కడున్న వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ విభీషణరావు ఉన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

అయ్యన్నను కలిసిన సీఎం రమేష్ సోదరుడు

నర్సీపట్నం, మార్చి 26 : రాజ్యసభ మాజీ సభ్యుడు సీఎం రమేష్ సోదరుడు రాజేశ్ మంగళవారం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వంగా కలిశారు. మంగళవారం ఆయన నర్సీపట్నంలోని శివపురంలో గల అయ్యన్న ఇంటికి వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేష్ పేరు వినిపిస్తున్న తరుణంలో ఆయన తమ్ముడు అయ్యన్నను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎర్రవరంలో ఘనంగా గంగాదేవి పండగ

గొలుగొండ, మార్చి 26 : ఎర్రవరంలో గంగాదేవి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్థులు అమ్మవారికి పసుపు కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం రామాలయం వద్ద ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ పెద్దలు అప్పల సత్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి గణేశ్ ప్రచారం

కృష్ణాదేవిపేట, మార్చి 26 : సీహెచ్.నాగాపురం, కుమారపురం గ్రామాల్లో మంగళవారం వైసీపీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ ప్రచారాన్ని నిర్వహించారు. గత ఐదేళ్లలో నియోజవకర్గ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ యలమంచిలి రఘురామ్‌చంద్రరావు, సత్యనారాయణ, బుచ్చిబాబు, లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు 'పల్లె నిద్ర'

గొలుగొండ, మార్చి 26 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అంతా సహకరించాలని నర్సీపట్నం రూరల్ సీఐ హరి కోరారు. కొత్తఎల్లవరంలో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఆయన చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. ఎస్ఐ బి.కృష్ణారావుతో పాటు సర్పంచ్ కొల్లి రాంబాబు, మాజీ ఎంపీటీసీ శెట్టి వరహాలమ్మ పాల్గొన్నారు.

ఇంటిపై జెండాకు అనుమతి తప్పనిసరి

» జెండా సైజు, డోర్ నెంబరు వివరించాలి » ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి » పార్టీల నాయకుల సమావేశంలో ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, మార్చి 26 : ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని నర్సీపట్నం నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో హెచ్‌వీ జయరాం అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌తో మంగళవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఇళ్ల మీద పార్టీ జెండాలు కట్టుకోవడానికి అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకునేటప్పుడు డోర్ నెంబరు, జెండా సైజు పేర్కొనాలని స్పష్టం చేశారు. సభలు, ర్యాలీలు కోసం ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందిగా సూచించారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతు నాతవరం మండలం పీకే గూడెం సచివాయం పరిధి పెద జగ్గంపేటలో నలుగురు వలంటీర్లు వైసీపీ ఎన్నికల ప్రచారంతో పాల్గొన్నారని ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఎంతమంది వలంటీర్లపై చర్యలు తీసుకున్నారని కోరగా, గొలుగొండలో ఇద్దరు, నర్సీపట్నం మునిసిపాలిటీలో ముగ్గురు మొత్తం ఐదుగురు వలంటీర్లను విధులను తొలగించామని ఆర్‌వో జయరాం వివరించారు. ఈ సమావేశంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మీసాల సుబ్బన్న, బీజేపీ ప్రతినిధి అడిగర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ నాయకులు, ఎంపీడీవోల సమావేశంలో మాట్లాడుతున్న జయరాం

ఇవే చివరి ఎన్నికలు ఆశీర్వదించండి

» చెర్లోపాలెం శంఖారావం సభలో మాజీ మంత్రి అయ్యన్న విజ్ఞప్తి


చెర్లోపాలెం శంఖరాం సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నాతవరం, మార్చి 26 : ఇవే తనకు చివరి ఎన్నికలని, ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను అంతా ఆశీర్వదించాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. మండలంలోని చెర్లోపాలెంలో మంగళవారం రాత్రి జరిగిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పదవసారి తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని తెలిపారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని దుయ్యబట్టారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి, చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో చాలారోడ్లు అధ్వానంగా ఉన్నా కనీసం మరమ్మతులు చేపట్టే పరిస్థితి కూడా లేదన్నారు. తాండవ లికేజీలను ఈ వేసవిలోనైనా అరికట్టాలని కోరారు. మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ లాలం అచ్చిరాజు, సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ కూండ్రపు అప్పలనాయుడు, నాయకులు ఇటంశెట్టి సీతారామ్మూర్తి, పైల సూరిబాబు, ఇనపసప్పల సత్యవతి, జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్ర, వెలగల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి'

మాకవరపాలెం : టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి అయ్యన్న సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. మంగళవారం రాత్రి బుచ్చన్నపాలెంలో ఏర్పాటైన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి అంతా అయ్యన్నపాత్రుడ్ని ఈ ఎన్నికల్లో గెలిపించాల్సిందిగా కోరారు. మాజీ జడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు, టీడీపీ నాయకులు రమణమ్మ, లగుడు శ్రీను, రుత్తల జోగిపాత్రుడు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు ఎత్తులు!

కృష్ణాదేవిపేట, మార్చి 26 : గొలుగొండ మండలం లింగంపేటలోని బొడ్డేరు గెడ్డలో ఏర్పాటు చేసిన భారీ రక్షిత మంచినీటి పథకం ప్రాజెక్టు సంరక్షణకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపట్టిన చర్యలకు పలువురు ఇసుక అక్రమార్కులు విఘాతం కలిగిస్తున్నారు. గెడ్డలో ఇసుక తవ్వకాలు జోరందుకోవడంతో నీటి పథకం ప్రాజెక్టుకు భవిష్యత్తులో తలెత్తనున్న నష్టాన్ని గుర్తించిన సదరు అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి తొమ్మిదో తేదీన గెడ్డకు వెళ్లే రహదారి మధ్యలో లారీలు, ట్రాక్టర్లు వంటి వాహనాలు వెళ్లకుండా పెద్దపెద్ద గోతులను జేసీబీ సాయంతో తీయించారు. దీంతో గత కొంత కాలంగా ఇసుక తవ్వకాలు తగ్గుముఖ పట్టాయి. ప్రాజెక్టు సురక్షితంగా ఉంటుందని అంతా భావిస్తున్న తరుణంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సదరు గోతులను పూడ్చివేశారు. మళ్లీ ఇసుక అక్రమ తవ్వకాల కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడి ఉంటారని పలువురు ఆరోపిస్తున్నారు.

వైసీపీ ఎంపీ అభ్యర్థి 'బూడి'

... 5వ పేజీ తరువాయి

ఆమెను తాడేపల్లి పిలిపించుకొని మాట్లాడారు. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్తగా ఆమెను నియమిస్తారని ప్రచారం కూడా జరిగింది. కానీ పొత్తులో భాగంగా అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించడం, ఆ పార్టీ తరఫున సీఎం రమేశ్ పేరు ఖరారు కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత బూడి ముత్యాల నాయుడును రంగంలోకి దించాలని నిర్ణయించారు. దీంతో గవర సామాజిక వర్గానికి ఇటు అసెంబ్లీకి, అటు లోక్‌సభకు పోటీ చేసే అవకాశాన్ని వైసీపీ పెద్దలు కల్పించలేదు.

వైసీపీ మాడుగుల అభ్యర్థిగా అనురాధ!?

మాడుగుల, మార్చి 26: ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధను మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం మంగళవారం ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో మాడుగుల నుంచి వైసీపీ అభ్యర్థిగా ఆమె పోటీ చేయడం దాదాపు ఖాయమైనట్టేనని నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్న ఈమె స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1986 నవంబరు 4వ తేదీన బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులకు జన్మించిన అనురాధ.. ఇంటర్ వరకు చదివారు. భర్త ఈర్లె గంగునాయుడు. ఇతను గతంలో కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. వీరికి ఇద్దరు పిల్లలు.. కుమార్తె, కుమారుడు వున్నారు.

వైసీపీ ఎన్నికల స్టంట్

... 5వ పేజీ తరువాయి

మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎట్టకేలకు ఇటీవల గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ నెల 11వ తేదీన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకంపై జోగులు పేరు లేదు. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పేరు వున్నప్పటికీ ఆయన ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇది జరిగిన సరిగ్గా ఐదు రోజులకు కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. వంతెన పనులకు ఇంతవరకు టెండర్లు పిలవలేదు. ఎన్నికలో కోడ్ అమల్లో వున్నంత కాలం టెండర్లు పిలవడానికి, పనులు ప్రారంభించడానికి వీలుకాదు. సుమారు ఐదేళ్లపాటు వంతెన నిర్మాణం గురించి పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం, సరిగ్గా ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసి ప్రజలను మభ్య పెడుతున్నదని, ఇది పూర్తిగా ఎన్నికల స్టంట్ అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఆరోపిస్తున్నారు. పైగా గతంలో శంకుస్థాపన చేసి, సగం మేర పూర్తయిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా వుందని ఆమె అన్నారు.

ఇంకా ఐదు రోజులే!

... 5వ పేజీ తరువాయి

ఆస్తి పన్ను వసూలు చేస్తుంటారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు మొదటి విడత పన్నును సకాలంలో చెల్లించకపోతే అక్టోబరు నుంచి నెలకు నూటికి రెండు రూపాయల చొప్పున వడ్డీ విధిస్తున్నారు. అదే విధంగా అక్టోబరు ఒకటి నుంచి మార్చి 31 వరకు రెండో దఫా పన్ను చెల్లించకపోయినా ఇదే నిబంధన వర్తిస్తుంది. అందువల్ల ఆస్తి పన్ను బకాయి వున్న వారికి వడ్డీ భారం పడకుండా ఈ నెలాఖరులోగా మొత్తం బకాయి చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కమిషనర్ కోరుతున్నారు.

వెజిట్రబుల్ మార్కెట్

... 5వ పేజీ తరువాయి

తరువాత కూడా కూరగాయ వ్యాపారులను ఇందిరా మార్కెట్‌కు తిరిగి పంపించడంలో పోలీసులు, మండల పరిషత్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి.

రాకపోకలకు ఇబ్బందులు

చింతపల్లి రోడ్డులో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్ పక్కనే నర్సీపట్నం కోర్టు సముదాయం ఉంది. అలాగే ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా నేల దుకాణాలు, షెడ్లు ఉండడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మంగళ, గురు, శనివారాల్లో ఈ సమస్య మరింత అధికంగా వుంటున్నది. పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

ఎన్నికల విధులకు ఆటంకమే..

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ విభాగాలు ఏర్పాటు చేశారు. నోటిఫికేషన్ విడుదల నుంచి ఎన్నికల తేదీ వరకు నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు, ప్రత్యేక పోలీసు బలగాల వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. మెయిన్ రోడ్డులో సంత వల్ల ఎన్నికల సిబ్బంది, ఉన్నతాధికారుల రాకపోకలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని పలువురు అధికారులు అంటున్నారు.

ఇందిరా మార్కెట్‌కు వ్యాపారులను తరలిస్తే ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీరుతుందని, అలాగే ఇందిరా మార్కెట్‌కు ఆశీలు రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పలువురు చెబుతున్నారు.

చోడవరం
నియోజకవర్గం

నీటి ఎద్దడి, పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ నూకరాజు

రోలుగుంట, మార్చి 26: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, ఇళ్ల, కొళాయిల పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఈవోపీఆర్డీ నూకరాజు ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలుకు కృషి చేయాలన్నారు.

1,500 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

రోలుగుంట, మార్చి 26 : మండలంలోని గుండుబాడు శివారు గుర్రాలపాలెంలో మంగళవారం సారా తయారీ కేంద్రాలపై ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,500 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు.మండలంలోని అసాంఘిక చర్యలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో కూటమి గెలుపే లక్ష్యం

» నేతలంతా సమన్వయంతో పనిచేద్దాం
» టీడీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి రాజు



చోడవరం, మార్చి 26: నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలంతా కలిసి సమన్వయంతో బీజేపీ ఎంపీ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకునేందుకు అందరూ కృషి చేయాలని టీడీపీ చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే అన్ని మండలాలు గ్రామాల్లో మూడు పార్టీల నాయకులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశాలకు టీడీపీ జనసేన బీజేపీ కార్యకర్తలంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. క్షేత్రస్థాయిలో అందరూ కలిసికట్టుగా పనిచేసి కూటమి అధికారంలోకి వచ్చేంత వరకూ అలుపెరగని పోరాటం చేయాలన్నారు.

తాతయ్యబాబును కలిసిన సీఎం రాజేష్



బుచ్చెయ్యపేట, మార్చి 26: భారతీయ జనతా పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్ వడ్డాదిలో మంగళవారం టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ విజయానికి కృషి చేయాలని రాజేష్ కోరారు. నియోజకవర్గంలో కూటమి బలోపేతానికి తీసుకోవలసిన చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ, ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ విజయానికి టీడీపీ, జనసేన పార్టీలు సంయుక్తంగా పాటుపడతాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో చోడవరం అసెంబ్లీ సీటుతోపాటు అనకాపల్లి ఎంపీ సీటు గెలుస్తాయని తాతయ్యబాబు ధీమా వ్యక్తం చేశారు.

గంగాదేవితల్లి గావు అమ్మవారిని దర్శించుకున్న పైలా

కె.కోటపాడు, మార్చి 26: మండలంలోని కేజేపురంలో గంగాదేవితల్లి గావు పండగ సందర్భంగా అమ్మవారిని టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు ఎడ్ల రమేష్, వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ ఎడ్ల తాతబాబు, టీడీపీ నాయకులు రెడ్డి సూర్యనారాయణ, రాజు, రెడ్డి అప్పలనాయుడు, కె. రమేష్, పూడి శ్రీను, యాదవ సంఘం అధ్యక్షుడు గుంపాన గంగరాజు, సర్పంచులు పూడి నారాయణమూర్తి, బొడ్డు అక్కునాయుడు, వెలగల పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల
నియోజకవర్గం

మధ్యాహ్న భోజనం మెనూ అమలుచేయాలి


మెనూ గురించి ఆరా తీస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

చీడికాడ, మార్చి 26: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి హెచ్ఎం పద్మావతిదేవిని ఆదేశించారు. మండలంలో జైతవరం, జేబీ.పురం, తునివలస, దండిసురవరం పంచాయతీలను మంగళవారం తనిఖీ చేసిన అనంతరం దండిసురవరం యూపీ పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతిరోజు మెనూ అమలవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సలహాలిచ్చారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్,సీనియర్ అసిస్టెంట్ ఉమావాణిశ్రీ పాల్గొన్నారు.

చీడికాడలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ రేపు

చీడికాడ, మార్చి 26: మండల కేంద్రంలో ఈనెల 28వ తేదీన ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. చీడికాడ కరణం కుటుంబీకుల ఇలవేల్పు అయిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, 3గంటలకు ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్లపరుగు పోటీలు నిర్వహించనున్నామన్నారు.

ఘనంగా ఇంధన వారోత్సవాలు

దేవరాపల్లి, మార్చి 26: మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంధన వనరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఇంధన వనరుల ఆవశ్యకత, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు జరిగాయి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సుజాత, కె.రాంబాబు, ఉపాధ్యా యులు రామలక్ష్మి, పూర్ణిమ, మాధవి పాల్గొన్నారు.

కూలిన చింతచెట్టు


కూలిన చెట్టుని తొలగిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, మార్చి 26 : మండలంలోని ఎం.కోటపాడు-కేజేపురం జంక్షన్‌ల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చింత చెట్టు కూలిపోయింది. ఒక్కసారిగా చెట్టు కూలిపోవడంతో చుట్టు పక్కల రైతులు భయపడ్డారు. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీనివల్ల కొంతసేపు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు తప్పించుకుని వెళ్లేందుకు అవకాశం ఉండడంతో వారికి ఇబ్బంది కలగలేదు. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని చెట్ల కొమ్మలు, మాను నరికించి ఎక్స్‌వేటర్‌తో తొలగించారు.

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది : ఎంపీడీవో


ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

రావికమతం, మార్చి 26: ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని ఎంపీడీవో భానోజీరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌బీకేలో ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బలమైన ప్రజాస్వామ్య పాలనకు ఓటర్లు ఓటుహక్కును వినియోగిచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రూప, వెలుగు ఏపీఎం దామోర్ తిలక్ పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ


అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

మాడుగుల, మార్చి 26: స్థానిక మోదకొండమ్మ ఘటాల పండుగను మంగళవారం మోదమాంబ కాలనీకి చెందిన ప్రజలు ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో 350 ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

మాడుగుల, మార్చి 26 : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. భారత నిర్మాణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత శిబిరంలో 60మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని వైద్యులు గుర్తించారు. వారిని విశాఖ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

గవిరెడ్డికి టికెట్ ఇవ్వాలని ర్యాలీ

మాడుగుల, మార్చి 26: తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం మాడుగుల టికెట్ విషయంలో పునరాలోచన చేయాలంటూ మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు టికెట్ ఇవ్వాలని వారు కోరారు. ఈ ర్యాలీలో మండల టీడీపీ క్యాడర్ పాల్గొంది.

ఆలయ పూజారిని కొట్టడం అమానుషం

» వైసీపీ నాయకుడుపై కఠిన చర్యలు తీసుకోవాలి
» ఏఐబీఎఫ్ కార్యదర్శి సుసర్ల హరి డిమాండ్

బుచ్చెయ్యపేట, మార్చి 26: అభిషేకం సరిగా చేయలేదనే నెపంతో కాకినాడ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావు పెద్ద శివాలయానికి చెందిన అర్చకులు పి.వెంకట సత్యసాయి, మద్దిరాల విజయ్‌కుమార్‌లను కొట్టడం అమానుషమని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏఐబీఎఫ్) కార్యదర్శి సుసర్ల హరి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దేవుడి దృష్టిలో పేద, ధనిక తేడాలుండవన్నారు. భక్తులందరితోపాటు చంద్రరావుకు ప్రసాదం ఇవ్వడం అర్చకుడు తప్పిదం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అర్చకులు వెంకట సత్యసాయిని అసభ్య పదజాలంతో తిట్టి, కాలితో తన్నడం, అడ్డుకోబోయిన మరో అర్చకుడు మద్దిరాల విజయ్‌కుమార్ చెంపపై కొట్టి వైసీపీ నేత రాక్షసత్వాన్ని చాటుకున్నారని విమర్శించారు. అర్చకులపై దాడిని తీవ్రంగా ఖండించారు. అర్చకులపై దాడి చేసిన చంద్రరావును కఠినంగా శిక్షించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని సుసర్ల హరి హెచ్చరించారు.

టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తాం

» జనసేన మండల కార్యదర్శి నవీన్


మాట్లాడుతున్న జనసేన నాయకులు

బుచ్చెయ్యపేట, మార్చి 26: తెలుగుదేశం పార్టీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు విజయానికి తాము కృషి చేస్తామని జనసేన పార్టీ మండల కార్యదర్శి సయ్యపురెడ్డి నవీన్ అన్నారు. మంగళవారం వడ్డాదిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పొత్తు ధర్మాన్ని అనుసరించి కూటమి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తామని, ఆయన విజయానికి పాటుపడతామని ప్రకటించారు. ఎవరి బెదిరింపులకు లొంగేది లేదని నవీన్, జనసేన మండల సహాయ కార్యదర్శి సయ్యపురెడ్డి జనార్దన్, జనసైనికులు బొబ్బాది మాణీలు, మండపాక బాబురావు, అర్సంగల వాసు, నాళం వరహాలు స్పష్టం చేశారు.

'డౌన్ సిండ్రోమ్ వ్యాధికి మేనరిక వివాహాలే కారణం'


దివ్యాంగ విద్యార్థులకు ప్లాంక్‌లు అందిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం, మార్చి 26: మేనరిక వివాహాలలో సంతానం డౌన్‌సింగ్రోమ్ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు అన్నారు. ప్రపంచ డౌన్ సింగ్రోమ్ దినోత్సవం సందర్భంగా హైస్కూల్‌లో మంగళవారం దివ్యాంగ విద్యార్థులకు ప్లాంక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రోమోజోములు సమతుల్యత లోపించడం వలన డౌన్‌సింగ్రోమ్ వ్యాధితో పిల్లలు పుడతారన్నారు. మేనరిక వివాహాలు, 35 ఏళ్లు దాటిన తర్వాత గర్భం దాల్చిన వారి సంతానానికి ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధి నయమయ్యేందుకు ఇంతవరకు మందులు లేవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, అప్పలనాయుడు, బాలరాజు, బీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.